క్లుప్తంగా

ఆస్పత్రి తనిఖీ



ఐపీ విభాగాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ మల్లేష్

మైదుకూరు : మైదుకూరు హెచ్‌సీసీ ఆస్పత్రిని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మల్లేష్ శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని చికిత్స విభాగం, ఇన్‌పేషెంట్ విభాగం, స్త్రీల వ్యాధుల చికిత్స విభాగాలను ఆయన పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు ఎలాంటి సౌకర్యాలున్నాయని ప్రశ్నించగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ భూమిరెడ్డి చంద్రశేఖర్ సౌకర్యాలు, చికిత్సల వివరాల గురించి వివరించారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను విడుదల చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలయ్య

ప్రొద్దుటూరు రూరల్ : ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ బాలయ్య తెలిపారు. మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం విద్యా, వైద్యశాఖల అధికారులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 1–19 సంవత్సరాలలోపు వయసు గల వారందరికి ఉచితంగా నులిపురుగుల నివారణకు సంబంధించి ఆల్‌బెండజోల్ మాత్రలను ఇవ్వాలన్నారు. పిల్లల శారీరక, మానసిక అభివృద్ధికి ఆల్‌బెండజోల్ మాత్రలు ఎంతో దోహదపడుతాయన్నారు. మండల వ్యాప్తంగా 25వేల మాత్రలను విద్యా, వైద్యశాఖ సిబ్బంది పిల్లలకు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ సావిత్రమ్మ, కామనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హనీఫ్‌బాబా, హెల్త్ సూపర్‌వైజర్లు బీవీ వరప్రసాద్, చంద్రకళ, ఏఎన్‌ఎంలు జాస్మిన్, హేమ పాల్గొన్నారు.

పనులపై హైవే అధికారులకు ఫిర్యాదు

చాపాడు : నేషనల్ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలో యుటిలిటీ డక్టుల నిర్మాణాలు దుర్వినియోగం కాకుండా చూడాలని రైతులు కోరారు. మండలంలోని సోమాపురానికి చెందిన కిషోర్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రైతులు నేషనల్ హైవే అథారిటీ అధికారులను శనివారం కలిసి ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ రోడ్డు నిర్మాణంలో అక్కడక్కడా నీటి పైపులైన్లు, కేబుల్ వైర్లు, యుటిలిటీ డక్టుల పైపులను ఏర్పాటుచేస్తున్నారన్నారు. కొందరు సిబ్బంది దిని తప్పుదోవ పట్టిస్తూ తమ వ్యవసాయ పొలాలను నీటిని మళ్లించే కాల్వలుగా చేసే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సాగునీటి అవసరాల కోసం పలు చోట్ల పంట కాలువలు, వంతెనలను ఏర్పాటుచేస్తున్నా.. కొందరు స్వార్థంతో పైపులను దుర్వినియోగం చేయాలనే ఆలోచనలో ఉన్నారన్నారు. దుర్వినియోగం జరగకుండా చూడాలని కోరినట్లు రైతులు తెలియజేశారు.

ఘన నివాళి



చిన్న వెంకటసుబ్బయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

బి.కోడూరు : మండలంలోని పెద్దుళ్లపల్లె పంచాయతీ పరిధిలోని కొండంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు యాసాని చిన్న వెంకటసుబ్బయ్య గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి శనివారం ఆయన స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిన్న వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ సుబ్బారెడ్డి, జి.వెంకటరామిరెడ్డి, జి.రామచంద్రారెడ్డి, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిక్కిరిసిన కొండగోపాలస్వామి ఆలయం



ఆలయ ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో కొండగోపాలస్వామి

అట్లూరు : శ్రావణమాసం మూడవ శనివారం కొండగోపాలస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. శ్రీలంకమల్లేశ్వరస్వామి అభయారణ్యంలో వెలసిన కొండగోపాలస్వామి ఆలయంలో ప్రతి ఏటా శ్రావణమాస శనివారాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో మరీ ముఖ్యంగా మూడవ శనివారం భక్తులు అధిక సంఖ్యలో రావడం ప్రత్యేకత. మూడవ శనివారం వేకువజాము నుండే భక్తులు స్వామివారి దర్శనం కోసం స్నానపుగుండంలో స్నానమాచరించి క్యూలైన్‌లో బారులు తీరి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తుల కోసం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం నిర్వహించింది.

అలాగే స్వామివారిని దర్శించుకునేందుకు మండలం నలుమూలల నుండే కాకుండా జిల్లా నలుమూలల నుండి, అలాగే చిత్తూరు, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల నుండి కూడా వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద టూల్ డౌన్ సమ్మె చేస్తున్న కార్మికులు

ప్రొద్దుటూరు : మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో టూల్ డౌన్ సమ్మె చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు, పట్టణ అధ్యక్షుడు బి.రామయ్య మాట్లాడుతూ మున్సిపల్ పర్మినెంట్ ఉద్యోగులు, కార్మికులకు పెండింగ్ బకాయిలను ఉగాదికి చెల్లిస్తామని మంత్రి నారాయణ ప్రకటించడం శోచనీయమన్నారు. ఉద్యోగ, కార్మికులకు చెల్లించాల్సిన 6 డీఏలు, సరెండర్ లీవుల ఎన్‌క్యాష్‌మెంట్, రిటైర్మెంట్ గ్రాట్యుటీకి డబ్బు లేదంటున్నారని, మంత్రులు, ఎమ్మెల్యేలకు అలవెన్స్‌లకు మాత్రం డబ్బు ఉందా అని ప్రశ్నించారు. ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుధ్య కార్మికులు, ఆఫీస్ సిబ్బంది, స్కూల్ స్వీపర్లకు సంక్షేమ పథకాలు వర్తింపజేస్తామని జూలైలో మంత్రి నారా లోకేష్ చెప్పారని.. అందుకు అనుగుణంగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కార్మికుల కొరత ఉందని, చనిపోయిన, రిటైర్డ్ అయిన వారి స్థానంలో వారి కుటుంబ సభ్యులను విధుల్లో తీసుకోవాలన్నారు. మస్టర్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్మిక చట్టాల మేరకు మున్సిపల్ ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సమ్మె తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ నాయకుడు శ్రీను, యూనియన్ పట్టణ కార్యదర్శి బి.మధు, ఉపాధ్యక్షులు వెంకటలక్షుమ్మ, వీరమ్మ, శ్యామ్, సహాయ కార్యదర్శులు రాజేష్, గురుమూర్తి, ప్రమీలారాణి, చైతన్య, రావుల జ్యోతి, సమితి సభ్యులు లక్ష్మీదేవి, అరుణ్, నాగేంద్ర, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ఆసుపత్రులు నిబంధనలు తప్పక పాటించాలి



ప్రైవేటు ఆసుపత్రుల్లో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌బీఎస్‌కే జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రమేష్

బద్వేలు అర్బన్ : ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని రాష్ట్రీయ బాలస్వస్థ్య కార్యక్రమం ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.రమేష్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆయా ఆసుపత్రుల్లో వైద్య, ఆరోగ్యశాఖ నిబంధనల ప్రకారం అన్నిరకాల ప్రమాణాలు ఉన్నాయా లేవా అని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యం ఆసుపత్రుల్లో పనిచేసే వివిధ విభాగాల వైద్యుల పేర్లు రిజిస్ట్రేషన్ నెంబర్లతో సహా ప్రదర్శించాలని తెలిపారు. అలాగే స్కానింగ్ మిషన్ ఉంటే దాని రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌తో పాటు గర్భస్థ లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం అని తెలిపే బోర్డులను ప్రదర్శించాలని తెలిపారు. తనిఖీల్లో నిబంధనలు పాటించనట్లు గుర్తిస్తే సంబంధిత ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, సూపర్‌వైజర్ మహబూబ్‌బాష తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న కార్మికులు

బద్వేలు అర్బన్ : ఎన్నికల సమయంలో కూటమి నేతలు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని ఏఐటీయూసీ పట్టణ ప్రధాన కార్యదర్శి ఇర్ల నాగేష్ పేర్కొన్నారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఔట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న కార్మికులందరిని పర్మినెంట్ చేయాలని, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచి కార్మికులపై పనిభారం తగ్గించాలని కోరారు. అలాగే పదవీ విరమణ పొందిన ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఎలాంటి బెనిఫిట్స్ చెల్లించకుండా పంపించడం దారుణమని, ఆ ఉద్యోగాన్ని వారి కుటుంబంలో ఒకరికి కేటాయించాలని కోరారు. అలాగే ఔట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దేవా, హరి, వెంకటరెడ్డి, నాగేంద్రబాబు, వెంకటేష్, రమణ, నరసింహులు, నరసయ్య, ప్రసాద్, కార్మికులు పాల్గొన్నారు.

• అనుబంధాల రక్షాబంధన్



మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డికి రాఖీ కడుతున్న జింకా విజయలక్ష్మి



మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డికి రాఖీ కడుతున్న బ్రహ్మకుమారి



నాగార్జునరెడ్డికి జ్ఞాపిక అందజేస్తున్న బ్రహ్మకుమారి

ప్రొద్దుటూరు కల్చరల్ : విశ్వ సౌభ్రాతృత్వానికి, సమున్నత విలువలకు ప్రతీక రాఖీ పండుగ అని ఓంశాంతి భవనం నిర్వాహకురాలు శాంత, సౌజన్య తెలిపారు. శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా మాజీ ఎమ్మెల్యేలు శివప్రసాదరెడ్డి, శెట్టిపల్లె రఘురామిరెడ్డి దంపతులకు వారు తిలకం దిద్ది రాఖీలు కట్టారు. అలాగే టీడీపీ నాయకులు ప్రవీణ్ కుమార్‌రెడ్డి, వద్ది బాలుడులకు బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు.

ప్రొద్దుటూరు : రాఖీ పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని పలువురు మహిళలు శనివారం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పద్మశాలీయ విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, న్యాయవాది జింకా విజయలక్ష్మితోపాటు పలువురు ఉదయాన్నే ఆయన నివాసానికి వెళ్లి రాచమల్లుకు తిలకం దిద్ది రాఖీ కట్టి స్వీట్ తినిపించారు.

పోరుమామిళ్ల : రాఖీ పౌర్ణమిను పురస్కరించుకొని శనివారం ఎస్ఐ కొండారెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత నాగార్జునరెడ్డికి బ్రహ్మకుమారీలు రాఖీ కట్టారు. సమాజంలో అందరూ ఒకరి పట్ల ఒకరు అభిమానం, ప్రేమ, శాంతి కలిగి ఉండాలన్నారు. రాఖీ విశ్వమాన సౌభాతృత్వాన్ని సాధించే మార్గమన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను నిర్మించాలి

ప్రొద్దుటూరు : జిల్లాలో స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్ ఆధ్వర్యంలోనే నిర్మించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు. శనివారం సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. డిగ్రీ, బీటెక్ చదివిన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. స్టీల్ ప్లాంట్ ద్వారా దాని అనుబంధ పరిశ్రమలు ఏర్పాటైతే ఉద్యోగ అవకాశాలు లభించి నిరుద్యోగం తగ్గుతుందని తెలిపారు. సెయిల్ ఆధ్వర్యంలో స్టీల్ ప్లాంట్ పనులను ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీవైఎఫ్ఐ కార్యదర్శి బి.విశ్వనాథ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పూర్తిచేయాలి

పోరుమామిళ్ల : పట్టణంలో అధ్వానంగా ఉన్న రోడ్ల పనులు త్వరగా పూర్తి చేయాలని ఆల్ ఇండియా హ్యూమన్ రైట్స్ నేతలు గంగన్న, ఫణిరావు కోరారు. శనివారం విలేకరులతో వారు మాట్లాడుతూ పట్టణంలో ప్రధాన రహదారి పనుల్లో ఆర్ అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్ నిర్వాకం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి వెంటనే రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలని కోరారు.

పీ4పై గ్రామ సభ

మైదుకూరు : మండలంలోని నంద్యాలంపేటలో శనివారం పీ4పై గ్రామ సభ నిర్వహించారు. నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఆదిశేషారెడ్డి పీ4 గురించి వివరించారు. సహాయ పథక సంచాలకుడు సుబ్బారెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ నాగేంద్రబాబు, ఏపీఎం జయరాజు, పంచాయతీ కార్యదర్శి మాల్యాద్రి, పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : దివ్యాంగులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాలని ఆల్ ఆఫ్ యూ దివ్యాంగుల సేవా సొసైటీ రాష్ట్ర కన్వీనర్ అఫ్జల్, ఆంజనేయులు, మహేష్ కుమార్ తెలిపారు. శనివారం వారు మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని సీఎం చంద్రబాబు నాయుడుకు లేఖ రాసినట్లు తెలిపారు. ఈనెల 15న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నట్లు దివ్యాంగ పురుషులకు ఆ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు వలె 100 యూనిట్ల వరకు దివ్యాంగులకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, సదరం సర్టిఫికెట్లు కలిగిన దివ్యాంగులందరికీ 35 కేజీల అంత్యోదయ రేషన్ కార్డులు మంజూరు చేయాలన్నారు. 70 శాతం వైకల్యం కలిగిన వారందరికి త్రీవీలర్ మోటార్ పెట్రోల్ వాహనాలను మంజూరు చేయాలని తెలిపారు.

కల్యాణ వైభోగమే



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప సెవెన్‌రోడ్స్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శనివారం శ్రవణా నక్షత్రం సందర్భంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చక బృందం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, అలంకారం చేసి ప్రత్యేక పీఠంపై కొలువుదీర్చారు. అనంతరం కల్యాణ క్రతువును క్రమంగా నిర్వహించి అర్చకులు స్వామి పక్షాన అమ్మవారి గళసీమలో మహా మంగళ సూత్రాలను అలంకరించారు.

• లక్ష్మీనరసింహస్వామికి పూజలు



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

గోపవరం : మండలంలోని వల్లెరవారిపల్లె గ్రామంలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శ్రావణమాసం మూడవ శనివారం పౌర్ణమి సందర్భంగా స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజాభిషేకాలను ఘనంగా నిర్వహించారు. పంచలోహ తొడుగులతో, పూలమాలలతో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయ పూజారి పెంచలయ్య స్వామి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

• ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో పాత మార్కెట్‌లోని ఆంజనేయస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక పాతమార్కెట్‌లోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణమాస మూడవ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వేకువజామున ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేకంగా వెండి కవచాలు, రంగురంగుల గజమాలలతో అలంకరించారు. భక్తులు స్వామివారిని దర్శించేందుకు ఉదయం నుంచి బారులు తీరారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలను అందచేశారు. అలాగే టుటౌన్ సమీపంలోని, బుడ్డాయపల్లెలోని, కొర్రపాడు రోడ్డు, రామేశ్వరం, పెన్నానదీతీరంలోని పంచముఖ ఆంజనేయస్వామి, మైదుకూరురోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయాలతో పాటు పలు ఆంజనేయస్వామి ఆలయాల్లో శ్రావణమాస శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు, అలంకరణ చేశారు.

• తిరుమలనాథస్వామి కల్యాణం



విశేష అలంకరణలో ఉత్సవ మూర్తులు



స్వామి కల్యాణోత్సవాన్ని వీక్షిస్తున్న భక్తులు

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని ఎల్లంపల్లె తిరుమలనాథస్వామి ఆలయంలో శ్రావణ శనివారం సందర్భంగా స్వామి వారి కల్యాణం నయనానందకరంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి మూలవిరాట్‌లను ముందుగా విశేష అభరణాలు, రకరకాల పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహించగాన్ని పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వీక్షించారు. తోట్లపల్లె అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామి పాల్గొని భక్తులకు హైందవ ధర్మం గురించి వివరించారు. ఆలయ ధర్మకర్త హజరత్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం గిరి ప్రదక్షిణలో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

• ఘనంగా బిందెసేవ



బిందె సేవలో భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని అమృతానగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు ఘనంగా జరిగాయి. విగ్రహ ప్రతిష్ట, ప్రాణప్రతిష్ట, గణపతి, నవగ్రహ, శాంతి హోమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. చౌడేశ్వరి అమ్మవారితో పాటు వినాయకుడు, కాలభైరవుడు, నవగ్రహాలు, నాగదేవత విగ్రహాలను ప్రతిష్టించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రాత్రి అమ్మవారి కలశాలను భక్తులు తల మీద ఉంచుకుని అమృతానగర్‌లో ఘనంగా బిందెసేవ ఉత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు బండారు సూర్యనారాయణ, పల్లా నరసయ్య, వెంకటపతి, చౌడయ్య తదితరులు పాల్గొన్నారు. శనివారం అర్ధరాత్రి నుంచి జ్యోతి ఉత్సవాలను నిర్వహించారు.

ఘనంగా సత్యనారాయణ స్వామి వ్రతం



ప్రొద్దుటూరు కల్చరల్ : కుంకుమ పూజ చేస్తున్న మహిళలు



ప్రొద్దుటూరు కల్చరల్ : సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు కల్చరల్ : శ్రావణ మాస పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించడంతో పాటు కొన్ని ఆలయాల్లో భక్తులకు అన్నప్రసాద వినియోగం జరిగింది. మండల పరిధి కొత్తపేట నుంచి లక్ష్మీనరసింహాపురంలోని లక్ష్మీదేవి అమ్మవారికి, చౌడేశ్వరిదేవి అమ్మవారికి చీరసారెలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. లక్ష్మీనరసింహస్వామివారికి విశేష పూజాకార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు. రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత రతనాల వేంకటేశ్వరస్వామికి, స్వామివారి చెల్లెలు లలితా దేవికి విశేష పూజలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం 108 మంది సుహాసినులతో లలితాదేవికి జాజి పూలతో సహస్ర నామార్చన, వెంకటేశ్వరస్వామికి సామూహికంగా కుంకుమార్చనను నిర్వహించారు. దత్తపీఠంలో పౌర్ణమి సందర్భంగా సామూహికంగా సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించి భక్తులకు అన్నప్రసాద వినియోగం చేశారు.

• వెల్లాలలో భక్తుల సందడి



ఈఓ వెంకటరమణకు విరాళాన్ని అందిస్తున్న దాత ప్రతాప్‌రెడ్డి

రాజుపాళెం : మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణ మాసం మూడో శనివారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం స్వాములకు అర్చకులు అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి, భక్తులు స్వాములకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయానికి భక్తులు విరాళాలు

వెల్లాలలోని ఆలయాలకు భక్తులు విరాళాలు అందజేశారు. రాజుపాళెంకు చెందిన నంద్యాల ప్రతాప్‌రెడ్డి (ఎల్ఐసీ) రూ.50,116, కడపకు చెందిన బాలకృష్ణయ్య జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.50,116, దేవగుడికి చెందిన శెట్టిపల్లె సంజీవరెడ్డి రూ.లక్ష, ఆళ్లగడ్డ మండలం మర్రిపల్లెకు చెందిన తిరుపాల్ రూ.50,116, బొల్లవరానికి చెందిన సంజీవరాజ జ్ఞాపకార్థం వారి కుమారులు రూ.50,116 విరాళంగా అందించినట్లు ఆలయ ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు.

కమనీయం... శ్రీ లక్ష్మి పాలకొండ్రాయస్వామి కల్యాణం



కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు



మాంగల్యాన్ని భక్తులకు దర్శింపజేస్తున్న అర్చకుడు

కడప సెవెన్‌రోడ్స్ : శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని కడప సమీపంలోని శ్రీ పాలకొండ్రాయస్వామి ఆలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు యోగేశ్వరశర్మ, ఇతర అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు అశేష భక్తజనం తరలివచ్చారు. కల్యాణ క్రతువులో భాగంగా గణపతిపూజ, పుణ్యాహ వాచనం, విశ్వక్సేన ఆరాధన, కలశారాధన, మాంగల్య పూజ, యజ్ఞోపవీత ధారణం, కన్యాదానం, మాంగల్యధారణ, ముత్యాల తలంబ్రాలు, అనంతరం మాల పరివర్తనం తదితర కార్యక్రమాలను శ్రీవైష్ణవ పాంచరాత్ర ఆగమోక్త ప్రకారంగా నిర్వహించారు. కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో ప్రాకారోత్సవం నిర్వహించారు. జిల్లా దేవాదాయశాఖ అధికారి మల్లికార్జున ప్రసాద్, ఆలయ ఈఓ శ్రీనివాసులు, ఆలయ చైర్మన్ రెడ్డెయ్య యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భారీ శకటం.. ట్రాఫిక్‌కు సంకటం



పట్టణ పరిధిలో భారీ యంత్రంతో వెళ్తున్న వాహనం



పట్టణం దాటి వెళుతున్న భారీ యంత్రంతో కూడిన వాహనం

బద్వేలు అర్బన్ : బద్వేలు మీదుగా క్రిష్ణపట్నం ఓడరేవుకు వెళ్లేందుకు ఔటర్ రింగురోడ్డు లేకపోవడంతో బళ్లారి నుంచి క్రిష్ణపట్నానికి వెళ్లే, క్రిష్ణపట్నం నుండి అనంతపురం జిల్లాలోని సిమెంటు పరిశ్రమలకు వెళ్లే భారీ వాహనాలు బద్వేలు పట్టణంలో నుండే వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఇలా తరచూ ఆయా ప్రాంతాల నుండి బద్వేలు మీదుగా భారీ యంత్రాలను తరలిస్తున్న వాహనాలు పట్టణంలోకి ప్రవేశిస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. జాతీయ రహదారి అయినప్పటికీ అందుకు అనుగుణంగా పట్టణ పరిధిలో రోడ్లు విశాలంగా లేకపోవడం, విద్యుత్ తీగలు జాతీయ రహదారి నిబంధనలకు అనుగుణంగా ఎత్తులో లేకపోవడంతో వాహనం వెళ్లేందుకు అరగంటకు పైగా సమయం పడుతోంది. మరికొందరు విధిలేని పరిస్థితిల్లో భారీ యంత్రాలతో కూడిన వాహనాలను రాత్రి వేళల్లో పట్టణం దాటిస్తున్నారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఔటర్ రింగురోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని పట్టణవాసులు కోరుతున్నారు.